కథ

# స్నేహాబంధం

**సితారె**

**మా**ధవరావు బ్యాంకు ఉద్యోగి.
మేనేజరుగా ప్రమోషన్ ఇస్తూ బదిలీ చేశారు. సిటీ వదిలి రావటంతో బాధనిపించినా తప్పలేదు. తన కోసమే అన్నట్టు అక్కడో బ్రాంచి ప్రారంభించారు.
అదో పల్లెటూరు. పేరు గూటాల. గోదావరి గట్టుకు ఆనుకుని ఉంది. గట్టుపై నిలబడి చూస్తే తళతళమెరిసే సువిశాల గోదావరి..మధ్యలో పట్టిసీమ ఆలయం... చూపు మరల్చలేని మనోహర దృశ్యం.. మాధవరావు డ్యూటీలో చేరటానికి వెళ్లిన రోజు. గూటాల్లో గట్టుపై బస్సు దిగిన వెంటనే, గోదావరిని చూస్తూ అలా వుండిపోయాడు మైమరిచి.

''బాబూ! నువ్వీ ప్రాంతానికి కొత్తా?'' ప్రశ్న వినిపించి, స్పృహలోకి వచ్చి మాధవరావు అడిగిన వ్యక్తిని చూశాడు. వెండిలా మెరుస్తున్న పొడవైన గడ్డంతో తెల్లని దుస్తుల్లో రవీంద్రనాథ్ ఠాగూర్‌లా వున్నాడు. చూడగానే నమస్కరించాలనిపించేలా ఉంది ఆయన సౌమ్య రూపం.

''నమస్కారం తాతగారూ! మీ ఊహ కరెక్టే. నేనీవైపు రావటం ఇదే మొదటిసారి. నేను ఈ ఊరికి బ్యాంకు మేనేజరుగా వచ్చాను. తల్లి గోదావరిని చూసి నన్ను నేనే మరిచిపోయాను'' అన్నాడు నవ్వుతూ.

''ఇకపై ప్రతి నిత్యం ఆ అమ్మ నీకు పవిత్ర జలంతో స్నానం చేయిస్తుంది. దాహం తీర్చటానికి అమృతాన్నిస్తుంది. ఎలాంటి అనారోగ్యాన్నీ దరి చేరనివ్వదు. తన, తీర వాసుల్ని సదా కన్నతల్లిలా కాపాడుతుంది. వెళ్లు! ముందుగా రేవులోకి వెళ్లి కాళ్లూ చేతులు కడిగి, అదిగో.. ఆంజనేయస్వామి గుడి.. ఆ స్వామికి నమస్కరించి అప్పుడు బ్యాంకుకు వెళ్లు, ఆయన నీ వెంటేవుంటాడు'' అన్నాడు.

ఆయన మాటలు మాధవరావుకి గురూపదేశంలా అనిపించింది. గట్టుపై నుంచి కిందికి మెట్లున్నాయి. దిగుతూ వెళ్లాడు.

* * *

ఎంత వెదికినా ఆ గ్రామంలో అద్దెకు అన్ని సదుపాయాలున్న ఇల్లు దొరకలేదు. చివరికి అతి ప్రాచీన చరిత్ర కలిగిన ఓ మండువా లోగిలి నచ్చింది మాధవరావుకి. అదయినా గ్రామ పెద్దలంతా, ఆ ఇంటి యజమానిని ఒప్పించి ఇప్పించారు.

ఓ మంచిరోజున సామానంతా లారీలో పంపించి, వెనుక టాక్సీలో మాధవరావు కుటుంబం గూటాల చేరుకున్నారు.

పల్లెల్లో ప్రభుత్వోగ్యులంటే అభిమానం అపారం. లారీ చేరిన వెంటనే, పెద్దలు దగ్గరుండి మరీ సామానంతా సర్దించేశారు. మాధవరావు ఆశ్చర్యపోయాడు. పని వాళ్లకి సొమ్ము ఇవ్వబోయాడు.

సర్పంచ్ మాధవరావుని వారించి,''మేనేజర్ గారూ! ఇదంతా మా ధర్మం సర్.! మా సహకారానికి వెలకట్టకండి. ఆఁ! రేపటినుంచే మీకు పాలు, గోదావరి నీళ్ళు ఏర్పాటు చేశాను. అలాగే ఓ పని మనిషి వస్తుంది. ఇంట్లో పనితో పాటు బజారు నుంచి ఏం కావాలన్నా తెచ్చిపెడుతుంది. ఏ ఇబ్బంది వున్నా నాకు కబురెట్టండి, మొహమాట పడకండి సార్! వస్తాను'' అంటూ వెళ్ళబోతున్న సర్పంచ్ గోపాలరావుకి, మాధవరావు ధన్యవాదాలు తెలిపాడు. ఇదే సిటీలో అయితే ప్రతి చిన్న సహాయాన్ని కొనుక్కోవాల్సిందే! ఇక్కడ కోరకుండానే ఎంతో ఆప్యాయంగా సహకారం అందిస్తున్నారంటే, పల్లె ఇంకా పూర్తిగా కలుషితం కాలేదన్న మాట.. అదృష్టమే. అనుకుంటూ వీధిలోంచి ఇంట్లోకి ప్రవేశించాడు మాధవరావు.

మాధవరావు కుటుంబం చాలా చిన్నది. తల్లి-శారదాంబ, భార్య- రాధ, ఏకైక పుత్రికా రత్నం భారతి.

ఆరేళ్ల భారతి.. తెల్లగా బొద్దుగా చాలా ముద్దుగా వుంటుంది. పెద్ద ఆరిందాలా ఆ పసిపిల్ల మాటలు వింటుంటే ముచ్చటేస్తుంది. ఇంకా వినాలనిపిస్తుంది. ఆ ఇంట్లో భారతి ఆడిందే ఆట, పాడిందే పాట. అంత గారాబం అందరికీ. మాధవరావు ఇంట్లోకి వచ్చీరాగానే, రాధ కాఫీ అందిస్తూ'' ఇల్లు పాతదయినా, ఫర్వాలేదండీ! బాగానేవుంది. కాలక్షేపమే కష్టం. అలవాటు పడాలి. పుట్టాక ఇంత చిన్న ఊళ్లో వుండలేదు కదా?'' అంది.

''చూద్దాం. ఉండలేకపోతే రాజమండ్రి మార్చేద్దాం మకాం. నేను అక్కడి నుంచే రావచ్చు'' అన్నాడు.

దేవుని మందిరం సర్దుతున్న ముసలావిడ చెవిని పడ్డాయి కొడుకు మాటలు. '' ఒరేయ్ మాధవ్! ఇక్కడ మనుషులంతా చాలా మంచివాళ్లురా. సామానంతా ఒక్కటి కూడా పగలకొట్టకుండా జాగ్రత్తగా దించారు. పైగా అన్నీ సర్దేసి మరీ వెళ్ళారు. ఎవరో పాలు, కూరగాయలు పంపించారు. ఇంతలా ఇలా ఆదరించే ఊరు వదిలి, సమస్త అనాచారాలకు నిలయమైన సిటీకి పోదాం అంటున్నావా?'' మందలిస్తూ అంది శారదాంబ.

ఆమెది చెక్కుచెదరని వాగ్ధాటి. ఏడు పదులు

## సాధారణ ప్రచురణ (రూ. 1,000)కు ఎంపికయిన కథ

నిండినా, బి.పీ., షుగరు లేదు. ఏ అనారోగ్యము లేదు. తల్లి మాటంటే కొడుక్కి వేదం. కోడలిని కూతురిలా అక్కున చేర్చుకుంది. వద్దన్నా వంట పనంతా తనే చేస్తుంది, ఈ వయసులో కూడా. రాధ కూడా అత్తగారిలో తల్లిని చూస్తోంది. మమతానురాగాల గోపురం ఆ కాపురం.

''అమ్మా! నాకూ వెళ్లాలని లేదమ్మా! రాజమండ్రి అని ఎందుకన్నానంటే మన భారతి చదువు కోసం. ఇక్కడ ఇంగ్లీషు మీడియం కాన్వెంట్ లేదు. అదే సమస్య. ఇక్కడికి పదిహేను కిలోమీటర్ల దూరంలో మంచి స్కూలు వుందట! స్కూల్ బస్ వస్తుందట. అంతదూరం పంపించగలమా?అని''

''ఒహో అదా సమస్య. అదే బస్సులో ఈ ఊరు నుంచి వెళ్తున్న పిల్లలతో జతచేసి, నాలుగురోజులు పంపించి చూద్దాం! ఆ తర్వాత స్నేహితులతో కలిసి వెళ్తుందిలే, చూద్దాం'' అంది దేవుణ్ణి సర్దుకుంటూనే. అప్పుడే తన పుస్తకాలను అల్మరాలో అమర్చుకుంది భారతి.

''నానమ్మా, మే ఐ హెల్ప్ యూ'' అంది నవ్వుతూ.

''ఏమిట్రా అంటోంది?'' అంది శారదాంబ.

''మీకు సహాయం చేస్తానంటోంది కావాలంటే'' అంది రాధ.

''వద్దులే తల్లీ, సర్దుకున్న వాటిని అలా వుంచితే అదే పదివేలు'' అంది నాయినమ్మ. అంతా నవ్వారు గలగలా.

''భారతీ రా! మనం వంట చేద్దాం. ముందుగా పాలు పొంగించి, నీకిష్టమైన క్షీరాన్నం చేశా'' అంది రాధ, వంట గదిలోకి దారితీస్తూ.

''గుడ్.. అంటే ఇల్లు ఛేంజ్ అయితే ఇదో ఛాన్స్ వుంటుదన్న మాట'' అంది భారతి. తల్లి కూడా నడుస్తూ.

''అలాగని పాయసం కోసం వారానికో ఇల్లు మార్చమనేవ్ భడవా! పల్లెల్లో ఇల్లు దొరకవ్'' అంది శారదాంబ నవ్వుతూ.

మాధవరావు తల్లి దగ్గరగా వెళ్లి ''అమ్మా! రాబోయే కార్తీక పౌర్ణమినాడు పట్టిసీమ వీరభద్ర స్వామి ఆలయానికి వెళ్ళి అర్చన చేయిద్దాం'' అన్నాడు.

''నా మనసులో ఉన్న మాట కూడా అదే. తప్పక వెళ్దాం నాన్నా.. తప్పక వెళ్దాం.. మనం వస్తున్నప్పుడు కారులోంచి..నీటి మధ్య కొండ శిఖరంపై వెలిసిన.. ఆ ఆలయాన్ని చూస్తానా?అనుకున్నాను. నిజంగా ఇలాంటి పవిత్రక్షేత్రానికి నీకు బదిలీ కావటం, ఆ స్వామి అనుగ్రహమే అనిపిస్తోంది. తరుచు దర్శించి సేవించవచ్చు. మనం ఇల్లు మారవద్దు, ఇక్కడే వుందాం'' అంది శారదాంబ.

''అలాగే అమ్మా..! నాకూ ఇక్కడ ప్రకృతీ.. గోదావరీ.. బాగా నచ్చాయి. భారతి చదువు సంగతి..చూద్దాం లే! ఏదో ఒక స్కూలు దొరక్క పోదు. నే అలా ఊళ్లోకి వెళ్ళొస్తానమ్మా'' అంటూ బయటకు నడిచాడు మాధవరావు.

* * *

భారతిని ఓ ఇంగ్లీషు మీడియం పబ్లిక్ స్కూల్లో చేర్చారు. స్కూలు బస్‌లో వెళ్లివస్తోంది. అక్కడి నుంచి మరో ఆరుగురు పిల్లలు వెళ్తున్నారు. అతి త్వరలోనే భారతి వారితో స్నేహం పెంచుకుంది. హేపీగా స్కూలుకు వెళ్లి వస్తోంది. ఇంట్లో రాధ ఏకైక కాలక్షేపం టీ.వీ. సీరియల్స్. ఇక శారదాంబకు మంచి ఎంటర్‌టెన్‌మెయింట్ పనిమనిషి పాప. పూర్తిపేరు పాపయమ్మ.

ఆ ఊరికో పోలీస్‌స్టేషన్ వుంది. అక్కడ తుడిచి, మంచి నీళ్ళు తెచ్చిపెట్టే పని పాపకే ఇచ్చారు. మహా చలాకీది పాపయమ్మ. మాటకారి కనుక మాట పడకుండా మంచిపేరు తెచ్చుకుంది. పోలీస్ స్టేషన్‌లో గొడవలన్నీ మోసుకొచ్చి, పూస గుచ్చినట్టు చెబుతుంటే, శారదాంబ ఆసక్తిగా వినేది. ఆదివారాలయితే భారతి కూడా నాయనమ్మ వళ్ళో కూర్చుని పాపయమ్మ కబుర్లను వినేది.

ఇంటి వెనుక భాగంలో చాలా ఖాళీ స్థలం ఉంది. రాధకీ, మాధవరావుకి గార్డెనింగ్ అంటే ఎంతో ఇష్టం. కడిపిలంక నుంచి ఎన్నో రకాల పూల మొక్కల్ని తెప్పించి నాటారు. అలాగే దొండ, చిక్కుడు పాదులు పెట్టారు. సెలవు రోజుల్లో అమ్మా నాన్నలతో పాటు భారతి కూడా..తన చిట్టి చేతులతో మొక్కలకు నీళ్లు పోసేది. తొలిసారిగా ఒకేసారి అనేక రంగుల గులాబీలు విచ్చినప్పుడు భారతి ఆనందానికి అంతేలేదు. చప్పట్లు కొడుతూ చిందులు వేసింది.

''మమ్మీ! మమ్మీ! స్కూలుకు తీసుకెళ్లి మంచి రోజాలు మా మిస్సుకి ఇస్తా..నాకు కోసివ్వు మమ్మీ'' అంది భారతి తల్లితో. ''అలాగేనమ్మా! ఒకరోజు కాదు, రోజు ఇస్తుంటాలే తీసుకెళ్ళు'' అంది రాధ. ఆ పసిమనసు మురిసిపోయింది.

తోట పోను.. ఇంకా మిగిలిన స్థలంలో ఓ షెటిల్ కోర్టు ఏర్పాటు చేశాడు మాధవరావు. ఓ ఆదివారం రాజమండ్రి వెళ్లి నెట్టూ..నాలుగు బ్యాట్లూ తెచ్చాడు. నాయనమ్మ గారితో సహ అందరికీ మంచి వ్యాయామంగానూ, హాబీగా మారిందా ఆట.

ప్రతి వీకెండుకి.. పట్టిసీమో, పోలవరమో, గండి పోశమ్మ గుడికో, మాధవరావు కుటుంబమంతా వెళ్ళివస్తుంటారు. లాంచీపై గోదావరిలో ప్రయాణం చేస్తున్నప్పుడు కలిగే ఆ మధురానుభూతి, మహానగరాల్లో కాంక్రీటు గోడల మధ్య అతుక్కుపోయి బతుకీడ్చే వారికి లభ్యం కానిది.

పారిశ్రామిక కాలుష్యం లేని గాలి పీలుస్తూ, అమృత తుల్యమైన గౌతమి జలాన్ని తాగుతూ, మందు వేయని కూరగాయలు, ఆకు కూరలు తింటూ, తనివితీరా అందాల్ని చూస్తూ.. ఆటపాటలతో ఆనందంగా గడిచిపోతోంది కాలం, ఆ కుటుంబానికి.

* * *

రాధామాధవరావుల్ని పెళ్లిలోనే అంతా మేడ్ ఫర్ ఈచ్ అదర్ అన్నారు, అందులో మాధవరావుకు మరో అదృష్టం.. రాధ చేతి వంటకాలు అమృతాలే.

ఆ రోజు ఆదివారం.

రాధ అందించిన వేడివేడి పెసరట్లను, జీడిపప్పు ఉప్మాతో కలిపి, కొబ్బరి, అల్లం చెట్నీలతో



ఎంతో ఇష్టంగా తిన్నారు తండ్రీకూతుళ్లు. తర్వాత కాఫీ, బూస్టులు ఇచ్చింది. శారదాంబ గారు పూజ కార్యక్రమం పూర్తిచేసి, పాలుతాగి కూర్చుంది. భాగవతాన్ని వ్యాసపీఠంపై వుంచి, గజేంద్ర మోక్షంలోని పద్యాల్ని రాగయుక్తంగా చదవసాగింది. దిన చర్యలో అదో ముఖ్యమైన అంశం ఆమెకి.

భారతి అదే హాల్లో చాప పరుచుకుని, హోంవర్క్ చేసుకుంటోంది. రాధ వంట పనంతా ఆదివారాలు తనే చేస్తుంది. మధ్య మధ్య వస్తూ భారతికి తెలియనివి చెపుతుంది. మాధవరావు పడక కుర్చీలో వాలి, ఆదివారం పేపరులోని స్పెషల్ ఫీచర్సుని చూస్తున్నాడు.

''గ్రాండ్ మా! డోంట్ మేక్ నాయిస్, రీడ్ యువర్‌సెల్ఫ్'' భారతి కేకపెట్టింది.

''ఏమిట్రా ఆ పిల్లరాకాసి ఏదో అంటోంది?'' చదవటం ఆపి అడిగింది శారదాంబ.


''గొడవ చేయకుండా, నోట్లో చదువుకో నాయనమ్మా! అంటోంది'' అన్నాడు నవ్వుతూ మాధవరావు.

''అంతేనా.. లేక ఆంగ్లంలో తిడుతోందా? మహారాణి గారికి అభ్యంతరమైతే ఇదిగో నేను గ్రంథాన్ని మూసేస్తున్నాలే! అమ్మగారిని చదువుకోమను'' అంటూ లేచి భాగవతాన్ని పూజమందిరంలో దాచటానికి వెళ్లింది.

శారదాంబ పొడవుగా, సన్నగా, తెల్లగా ఉంటుంది. ఇంత వయసొచ్చినా తల పూర్తిగా తెల్ల పడలేదు, కళ్ళ జోడు పడలేదు. ఒక పన్నూ ఊడ లేదు. తల్లీ అందాన్ని, ఆరోగ్యాన్ని పుణికిపుచ్చు

## సి.పి.బ్రౌన్ అకాడమీ - నవ్యవీక్లి

### కథల పోటీ



కుని పుట్టాడు మాధవరావు. రాధ కూడా బాపు బొమ్మలా వుంటుంది. కలువరేకుల్లాంటి కళ్లతో. అందుకే అందాల ఆణిముత్యంలా పుట్టింది భారతి.

హోం వర్కు చేసుకుంటున్న భారతి తలపై కొన్ని గడ్డి పరకలు పడ్డాయి. తలెత్తి చూసింది. ఓ పిచ్చుక గూడు కనిపించింది. సరంబీ దూలంలో ఓ చోట పుచ్చి రంధ్రం యేర్పడింది. అందులో ఓ పిచ్చుక జంట గూడు పెట్టుకున్నాయి. అక్కడికి రెండు పిచ్చుకలు వచ్చిపోతూ కనిపించాయి భారతికి.

''మమ్మీ! మమ్మీ! ఇక్కడ పిచ్చుకలు ఏంచక్కా గూడు పెట్టాయి'' అంది భారతి. రాధ వచ్చింది. పైకి చూసి, వెంటనే..''పాపా! ఇటు రా త్వరగా'' అంటూ కేక వేసింది. పాపాయమ్మ దొడ్లో అంట్లు తోమటం ఆపి వచ్చింది కంగారుగా.

''అలా చూడు పైకి, పిచ్చుకలు నట్టింటనే గూడుపెట్టాయి..కాపురం ఉండే ఇంట్లో పక్షి గూళ్లు వుండటం అరిష్టమంటారు. నిచ్చెన తెచ్చుకుని ఆ గూటిని తీసిపడెయ్'' అంది రాధ.

''ఏమిటీ గొడవా?'' అంటూ శారదాంబ వచ్చింది. విషయం విన్న వెంటనే, ''అవును! పాడుపడిన దేవాలయాల్లో వుండాల్సిన పక్షులు, ఇలా పిల్లాపాపలతో వుండే నివాస గృహాల్లో గూళ్లు పెడితే అనర్థదాయకమే..తక్షణమే దాన్ని తీయించి వేయి'' అంటూ రాధను బలపరిచింది.

పాపాయమ్మ నిచ్చెన తెచ్చింది. దాన్ని సరంబీ వాసానికి వేసింది. అతి ప్రాచీనమైన లావైన టేకు బీములవి.చీరని కచ్చాపోసి, వీరవనితలా ఎక్కింది. రాధా, శారదాంబ, భారతీ చూస్తున్నారు.

పనిమనిషి పై మెట్టుపైకెక్కి, గూటిని తీయ

బోతూ, షాక్ తగిలినట్టూ చేయి వెనక్కి తీసింది. ''ఏమైంది తీయవేం?'' అడిగింది రాధ. ''అమ్మగారూ! ఈ గూట్లో రెండు పిల్లలున్నాయి, మరీ చిన్నవి. ఎలాగమ్మా తీయటం?'' అంది. ''ఆ గూటితో సహా తీసి, ఏ మొక్కల్లోనో దూరంగా పడేసిరా.. ఇంట్లో గూడు వుండకూడదని శాస్త్రాలు చెబుతున్నాయ్. తీసెయ్!'' ముసలమ్మ గారు హుకుం జారీ చేసింది. ''పాపం, ఇంకా రెక్కలు రాని పిల్లలమ్మగారూ తీసి ఎక్కడో పడేస్తే చచ్చిపోతాయి కదమ్మా!'' అంది పాపాయమ్మ చేతులు రాక.

''నీక్కాదూ చెప్పేది. తీసి పడేయ్ గూటిని.. వుండకూడదని చెబుతున్నాగా'' అంది శారదాంబ కోప్పడుతూ. కాని పాపాయమ్మ రాధ అభిప్రాయం కోసం ఎదురుచూస్తోంది, ఆమెను చూస్తూ. రాధ ఏమి చెప్పలేకపోతోంది. పాప భీతి అడ్డుపడుతోంది కంఠానికి. హోం వర్కు ఆపేసి, అందరి మాటలు వింటూ నిలబడ్డ భారతికి, విషయం పూర్తిగా అర్థమైంది. కాని అర్థం కానిది ఒక్కటే! నానమ్మ ఆ పిచ్చుక గూటిని తీసి, పిల్లలతో సహా పడేయమనటం. పాపం ఇంకా రెక్కలు రాని పిల్లలవి. చచ్చిపోతాయని పాపాయమ్మ చెప్పినా..నానమ్మ వినిపించుకోదేం?'' అన్నదే ఆ పసి మనసులో సంఘర్షణ.

రాధ నుంచి ఎలాంటి సమాధానం రాక, పాపాయమ్మ నిచ్చెనపై అలాగే నిలబడి వుండిపోయింది. శారదాంబలో సహనం చచ్చిపోయింది. తన పెద్దరికానికి విలువనివ్వక ఇంకా చూస్తూ జాప్యం చేస్తున్న పనిమనిషిపై మండిపడుతూ

''చెబుతుంటే వినిపించుకోవేం పాపమ్మా! చోద్యం చూస్తున్నావేంటి? ఆ గూటిని తీసుకుని దిగిరా! పడేసి వద్దువుగాని'' అంది.

ఇక తప్పదనుకుని పాపాయమ్మ గూటి మీదికి చేయి చాచింది. భారతికి కోపం పొంగుకొచ్చింది. పెద్దగా అరుస్తూ ఒక్కసారిగా '' ఏయ్ పాపీ! ఆగు. ఆ గూటిని ముట్టుకున్నావంటే చంపేస్తా. దిగిరా'' అంది. అంతా నివ్వెరపోయారు.

పనిమనిషి అచేతనంగా వుండిపోయింది రాధ ముఖంలోకి చూస్తూ. శారదాంబ కంఠం విప్పింది, ''ఎందుకని భారతీ దాన్ని తీయొద్దంటున్నావు, నానా చెత్త తెచ్చి వేస్తుంటాయి, గలీజు చేస్తాయి, తీసేయనివ్వు'' అంది మందలిస్తూ.

''నానమ్మ! నీవు పడేయమంటున్నది ఒట్టి గూడునే కాదు, అందులో బుట్టి పిచ్చుకలున్నాయంట! అవి చచ్చిపోవూ అందుకే వద్దంటున్నా'' అంది.

''చస్తే చావనివ్వు, గూడును ఇంట్లో వుంచకూడదమ్మా'' అంది నాయనమ్మ.

''అందుకని పిల్లల్ని చంపేస్తారా! వాటి మమ్మీ, డాడీ పిచ్చుకలు వచ్చి ఏడ్వవూ..పాపం కదూ.. నానమ్మా! నీవు రోజూ పూజలు చేస్తావు. పెద్ద పెద్ద బుక్స్ చదువుతావు. పిచ్చుక పిల్లల్ని చంపటం పాపమని లేదా వాటిలో'' అంది భారతి, పెద్ద ఆరిందాలా తన రెండు చేతులు ఆడిస్తూ.

అంతకుముందే అక్కడకు వచ్చి నిలబడి కూతురు మాటలు శ్రద్ధగా వింటున్న మాధవరావుకి మతి లేదు. ఓ క్షణం ఆలోచించి,

''పాపయమ్మా! దిగిరా. ఆ పిల్లలు ఎదిగే వరకూ, ఎగరగలిగే వరకు గూడు ముట్టుకోకు. ఆ రత్వాత తీసేద్దువు గాని, ఇంట్లో మా బుల్లి రాణీ గారి మాటకు ఎవరూ ఎదురుచెప్పకూడదు'' అన్నాడు నవ్వుతూ. పనిమనిషి దిగి నిచ్చెన తీసుకుని పెరటిలోకి వెళ్లిపోయింది.

ఇక, భారతి సంతోషంతో థ్యాంక్యూ డ్యాడీ అంటూ చప్పట్లూ కొడుతూ గంతులేసింది.నాయనమ్మను వెక్కిరించింది తన మాటే నెగ్గిందని. శారదాంబకి కోపం రాలేదు. ఆలోచనలో పడింది.

ఆ పసిపిల్ల అమాయకంగా అన్న మాటల్లో..'' ధర్మాల్ని పఠించటం, ఇతరులకు వినిపించటం కాదు. ఆచరించాలి. పూజలు చేస్తేనే దేవుడు సంతోషించడు. భూతదయ కలిగి వుండాలి. ప్రతి ప్రాణిలోనూ దైవాన్ని చూడగలగాలి'' అనే గీతా ప్రభోదం ప్రతి ధ్వనించింది. దాంతో నాయనమ్మ గారు..''అవును! వాటిపై జాలి చూపకపోవటం తొందరపాటే.. నా మనవరాలు ఈ రోజు నన్ను ఓ మహాపాపం నుండి కాపాడింది'' అనుకుంది మనసులో. లోనికి వెళ్లి, తన గదిలో నడుం వాల్చింది, పశ్చాత్తాపంతో.

రాధ తిరిగి వంటగదిలోకి వెళ్లిపోయింది. మాధవరావుకి మరో కాఫీ తాగాలనిపించింది, తనూ రాధిక వెనకే వెళ్లాడు. భారతి తిరిగి చాపపై కూర్చుని హోం వర్క్ చేసుకుంటోంది. అప్పుడే తల్లి పిచ్చుక వచ్చి గూటి గుమ్మంలో నిలబడింది. అంత వరకూ కిటికీ రెక్కపై నిలబడి పాపాయమ్మ చేయబోయిన ఘాతుకాన్ని చూసిన దాని చిన్న గుండెలో పెద్ద తుఫానే చెలరేగింది. గండం గడిచేంత వరకూ వణికిపోతూనే వుంది పాపం. అందరూ వెళ్లాక, అనందంతో గూటి దగ్గరి కొచ్చింది. తల్లి రాకను గమనించిన పిల్లలు ఆకలితో తమ ఎర్రని నోళ్లను తెరచి ఏడుస్తూ.. గూటి బైటకు మెడలు చాస్తున్నాయి. తల్లి పిచ్చుక వాటినోటిలోకి నోరు పెట్టి ఆహారాన్ని అందిస్తోంది. ఆ గొడవకి భారతి తలెత్తి గూటి వైపు చూసింది.

ఆ పిచ్చుకల తల్లి, బిడ్డల నోటికి మేతను అందిస్తున్న ఆ దృశ్యం చూస్తూ..భారతి పొందిన సంతోషం వర్ణించలేనిది. ఆ పసి హృదయం మైమరిచిపోయింది. అంతలో మగ పిచ్చుక కూడా వచ్చింది గూటి దగ్గరకు.

పని మనిషి చర్యకు భారతి మనసు ఆందోళన చెంది అడ్డుపడి వుండకపోతే, గూటిని పిల్లలతో పాటు పడేసి వుంటే, ఈ పాటికి

తమ గూడూ..పిల్లలు కనిపించక, తల్లీ.. తండ్రీ..పిచ్చుకలు ఏడుస్తూ ఎంతగానో గోలపెడుతూ వుండేవి పాపం.. ఎంతో పెద్ద గండం గడిచింది భారతి వల్ల.

కాస్సేపు పిల్లల దగ్గర గడిపి, ఆ పిచ్చుక జంట తిరిగి కిటికీలోంచి బయటకు వెళ్లిపోయాయి. పిల్లలు గూటిలోకి పోయాయి. భారతి బుక్స్ సర్దుకుని లోనికెళ్లింది.

* * *

సాయంత్రం ఆరు కావస్తోంది. మాధవరావు బ్యాంకు నుంచి వచ్చేశాడు. భారతీ స్కూలు బస్సు ఇంకా రాలేదు. ఎందుకో ఆలస్యమైంది. భారతీ రాగానే రోజూ షటిల్ ఆడుతుంటారు. అంత వరకూ ఇంకా మనవరాలు రాకపోయే సరికి శారదాంబ కొడుకు బుర్ర తినటం ప్రారంభించింది.

''చూడరా! అయిందింటికి రావాల్సిన పిల్ల ఇంకా రాలేదు. ఎంత ఆందోళనగా ఉంటుందో చూడు. ఇక్కడే ప్రభుత్వ పాఠశాలలో చేర్చరా అంటే విన్లేదు''

''వచ్చేస్తుంటుందమ్మా, స్కూల్లో ఏదో మీటింగు జరిగుంటుంది'' అన్నాడు మాధవరావు తల్లిని చల్లార్చుతూ.

''ఏమిటో.. నేడు తల్లిదండ్రులు పిల్లల చదువుల కోసం పిచ్చెక్కిపోతున్నారు. ఒకటవ తరగతి నుంచే పసి వాళ్లని రాచిరంపాన పెడుతున్నారు.

